క్లుప్తంగా

'సచివాలయ' నూతన కార్యవర్గానికి సత్కారం



జిల్లా నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న సచివాలయ ఉద్యోగులు

మద్దిలపాలెం: ఇటీవల ఎన్నికైన సచివాలయ ఉద్యోగుల డెమోక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులను గురువారం మద్దిలపాలెంలో సచివాలయ ఉద్యోగులు సత్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా డి.ఎ.సూర్య, కార్యదర్శిగా బంగారునాయుడు, ఉపాధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, తదితర కార్యవర్గ సభ్యులకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డి.ఎ.సూర్య మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

కెనడాలో పుష్కలంగా విద్యా, ఉద్యోగావకాశాలు

ఎంవీపీ కాలనీ: భారతీయ విద్యార్థులకు కెనడాలో విద్యా, ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయని లినోరా వీసా అండ్ ఇమిగ్రేషన్ సర్వీసస్ చైర్మన్ (కెనడా) పిలిప్ నేతగాని అన్నారు. విశాఖకు చెందిన శ్రీకృష్ణ ఓవర్‌సీస్ కన్సల్టెన్సీతో కలిసి గురువారం ఎంవీపీ కాలనీలోని ఐఏఎం క్యాంపస్‌లో కెనడాలోని విద్యా, ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెనడాలో భారతీయ విద్యార్థులు వేలాది మంది విద్యనభ్యసిస్తూ ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. శ్రీకృష్ణ ఓవర్‌సీస్ కన్సల్టెన్సీ డైరెక్టర్ ఎంవీ నారాయణరావు మాట్లాడుతూ కెనడా వెళ్లాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు లినోరా వీసా అండ్ ఇమిగ్రేషన్ సర్వీసస్ ద్వారా సేవలందిస్తున్నట్లు తెలిపారు. సందేహాలు ఉంటే సీతంపేటలోని సంస్థ కార్యాలయంలో ఈ నెల 24, 25 తేదీల్లో సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఐఏఎం కార్యదర్శి సుంకరి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయం కోరుతూ కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ: ఇటీవల సముద్రంలో గల్లంతై మరణించిన ఉమ్మిడి అనీల్, మరుపల్లి ప్రవీణ్ కుమార్‌ల కుటుంబ సభ్యులు ప్రభుత్వ సాయం కోసం గురువారం జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ ఘటన జరిగిన సమయంలో జిల్లా యంత్రాంగం స్పందించి పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండాపోయింది. ఇటీవల వారి మృతదేహాలు లభ్యం కాగా కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు పూర్తిచేశారు. పెద్ద దిక్కును కోల్పోయిన తమకు ప్రభుత్వ సాయం అందించి ఆదుకోవాలని అనీల్ భార్య ఉమ్మిడి రాజేశ్వరి, ప్రవీణ్ తల్లి నూకరత్నం కలెక్టర్‌ను కోరారు.

'లెబన్స్‌హిల్ఫే'లో అన్నదానం



విద్యార్థులకు వడ్డిస్తున్న నాగరాజు, తదితరులు

ఎంవీపీ కాలనీ: మద్ది రామయమ్మ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్ది లక్ష్మణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని లెబన్స్ హిల్ఫే మానసిక వికలాంగుల పాఠశాలలో గురువారం అన్నదానం చేశారు. విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, అప్పలరాజురెడ్డి, గురుమూర్తిరెడ్డి, నీలారెడ్డి, మంగరాజు, అప్పలమూర్తి పాల్గొన్నారు.

నటనలో మెలకువలు

- ప్రభుత్వ బాలుర గృహంలో అనాథ బాలలకు ఆశ్రయం
- విద్యా, వసతితో పాటు నటనలో తర్ఫీదు



బాలుర గృహం



స్లో మోషన్ నటనలో బాలురు



నాటిక ప్రాక్టీస్ చేస్తున్న బాలురు



బాలురకు వాయిస్ మార్చి మాట్లాడంలో శిక్షణ ఇస్తున్న శిక్షకుడు మూర్తి

ఆరిలోవ: వారంతా అనాథ బాలలు. వీధుల్లో దిక్కుతోచని స్థితిలో తిరుగుతున్న వారిని అక్కున చేర్చుకుని ఆశ్రయం కల్పించింది ముడసర్లోవ సమీప దీన్‌దయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర గృహం. ప్రస్తుతం ఇక్కడ 42 మంది బాలురు ఉన్నారు. వీరంతా వివిధ జిల్లాలకు చెందిన వారు. కొందరు తల్లిదండ్రులు లేనివారు అయితే.. ఇంకొందరు తల్లిదండ్రులకు భారమై వదిలేసినవారు ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. వీరికి చదువుతో పాటు భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. వివిధ చేతి వృత్తుల్లో శిక్షణ కూడా ఇస్తున్నారు. టైలరింగ్, నార సంచులు తయారు చేయడం, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్‌లో తర్ఫీదు ఇస్తున్నారు. అంతే కాకుండా ఇక్కడ బాలురకు నటనలో కూడా శిక్షణ అందిస్తున్నారు. నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాస్టర్ పి.వి.రమణమూర్తి 20 మంది పిల్లలకు నటనలో మెలకువలు నేర్పుతున్నారు. గత నెల 30న ఈ శిక్షణ ప్రారంభమైంది. ఏవిధంగా మాట్లాడాలి, ఎక్కువ సేపు ఆగకుండా మాట్లాడటం, డైలాగులు చెప్పడం, డైలాగు చెప్పడానికి బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్, వాయిస్ ఎక్సర్‌సైజ్, స్లో మోషన్‌లో నడవడం, పరుగెత్తడం, శారీరక వ్యాయామం తదితర అంశాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. మరో వారంలో శిక్షణ పూర్తి కానుంది. ఈ శిక్షణ ద్వారా పిల్లలకు మానసిక ఉల్లాసం, మాట తీరు, మంచి నడవడిక అలవడుతుందని గృహం సిబ్బంది భావిస్తున్నారు.

'తప్పు తెలిసింది' నాటికలో శిక్షణ

నెల రోజుల శిక్షణలో బాలురకు భాష, మాట్లాడే తీరు, ముఖ కవలికలు, నడక తీరు, మానసికంగా ఏవిధంగా ఉండాలి తదితర అంశాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం 'తప్పు తెలిసింది' అనే నాటిక బాలురకు నేర్పుతున్నారు. ఈ నాటికను ప్రముఖ సినీ దర్శకుడు, నటుడు, రచయిత ఎస్.కె మిస్రో రాశారు. క్రమ శిక్షణలేని చదువు, చెడ్డవారితో స్నేహం, చదువు మానేసి తిరగడం వల్ల భవిష్యత్‌లో ఎలాంటి అనర్థాలు ఎదురవుతాయి తదితర అంశాలతో పాటు క్రమశిక్షణతో మెలగడం, బాగా చదువుకోవడం వల్ల, మంచి స్నేహితులు కలిగినవారు భవిష్యత్‌లో ఎలాంటి ఉన్నత స్థానంలో నిలుస్తారో ఇతివృత్తంతో ఈ నాటిక సాగుతుంది.

ఇప్పటికి రెండు బ్యాచ్‌లకు శిక్షణ

ఇక్కడ కరోనాకు ముందు ఓ బ్యాచ్‌కు నటనలో శిక్షణ ఇచ్చాం. కరోనా కారణంగా రెండేళ్లకు పైగా బ్రేక్ పడింది. ఇప్పుడు మళ్లీ రెండో బ్యాచ్‌కు నటనలో శిక్షణ ఇస్తున్నాం. నటనలో మెలకువలు నేర్చుకుంటే బాలురలో మంచి నడవడిక, క్రమశిక్షణ అలవడుతుంది.

– కె.వీరయ్య, సూపరింటెండెంట్, ప్రభుత్వ బాలుర గృహం

2008 నుంచి శిక్షణ ఇస్తున్నాం..

నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2008 నుంచి వివిధ చోట్ల బాలలకు, పెద్దలకు నటనలో శిక్షణ ఇస్తున్నాం. ఎక్కువగా ప్రభుత్వ సంస్థల్లో ఉన్నవారికి శిక్షణ ఇస్తున్నాం. కస్తూర్బా పాఠశాలల్లో బాలికలకు కూడా పలుమార్లు నటనలో శిక్షణ ఇచ్చాం. బాలుర గృహంలో ఉన్నవారంతా వీధి బాలలే. వీరికి నటన, భవిష్యత్ జీవితంపై అవగాహన కల్పిస్తున్నాం. ఇక్కడ బాలలు నటన నేర్చుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

– పి.వి.రమణమూర్తి, శిక్షకుడు, నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్

బీసీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



సీఎం చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేస్తున్న అక్కరమాని విజయనిర్మల

- ఎమ్మెల్సీల కేటాయింపుల్లో ప్రాధాన్యంపై అక్కరమాని హర్షం
- 'తూర్పు'లో ముఖ్యమంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిబద్ధత, పరిపాలన దక్షతతోనే వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం లభిస్తోందని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. ఇటీవల సీఎం జగన్ ప్రకటించిన 18 ఎమ్మెల్సీల్లో 14 స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఎంవీపీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ తూర్పు శ్రేణులతో కలిసి ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ తొలి నుంచి ముఖ్యమంత్రి ఎస్సీ, ఎస్టీ, బీసీల పక్షపాతిగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాజకీయ పదవుల్లో ఆ వర్గాలకు అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఐదుగురు ఉపముఖ్యమంత్రులు ఉంటే.. అందులో నలుగురు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందినవారేనని గుర్తు చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కేటాయించిన 36 ఎమ్మెల్సీల్లో 25 ఎస్సీ, ఎస్టీ , బీసీలకు కేటాయించి వెనుకబడిన వర్గాల అభ్యున్నతిపై ఉన్న చిత్తశుద్ధిని చాటుకున్నారని చెప్పారు. దీంతో పాటు ముఖ్యమంత్రి జగన్ మంత్రివర్గంలో 70 శాతం పైగా మంత్రి పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీలకే దక్కాయన్నారు. గతంలో అనేక పార్టీలు ఆయా వర్గాలను ఓటు బ్యాంకుగా వాడుకోవడం మినహా దశాబ్దాలుగా ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం కల్పించలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు అక్కరమాని రోహిణి, ముర్వల లక్ష్మి, ఉమ్మిడి స్వాతి, గుడ్ల విజయసాయి, అప్పారి శ్రీవిద్య, కెల్లా సునీత, వార్డు ఇన్‌చార్జ్‌లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల గృహంలో ఇంద్రజాల దినోత్సవం



బాలికల గృహంలో ఇంద్రజాలం ప్రదర్శిస్తున్న అన్వర్ బాషా

ఆరిలోవ: రూరల్ తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికల గృహంలో బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ ఇంద్రజాల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ప్రపంచ ఇంద్రజాలకుడు పి.సి.సర్కార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇంద్రజాలకులు ఎస్.కె.అన్వర్ బాషా, కె.విజయకుమార్ తమ మ్యాజిక్కులతో బాలికలను అబ్బురపరిచారు. అనంతరం బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నవర ప్రకాసరావు మాట్లాడుతూ పి.సి.సర్కార్ ప్రపంచంలోనే మంచి పేరొందిన ఇంద్రజాలకుడన్నారు. ఆయన జయంతిని ప్రపంచ ఇంద్రజాల దినోత్సవంగా జరుపుకొంటున్నామని చెప్పారు. ఇంద్రజాలంతో మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. బాలలు ప్రతి అంశాన్నీ శాస్త్రీయ దృక్పథంతో చూడాలన్నారు. మ్యాజిక్ ఎంతో నైపుణ్యంతో ప్రదర్శించాల్సిన విద్య అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహం పర్యవేక్షకురాలు ఎస్.సునీత, వైద్యుడు బాబ్జీ, సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలోనూ పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలు వురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబజార్‌లో అందుబాటులో కొత్త చింతపండు



జీసీసీ స్టాల్‌లో వినియోగదారులకు కొత్త చింతపండు ప్యాకెట్ అందిస్తున్న ఈవో ప్రసాద్

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో కొత్త చింతపండు అందుబాటులోకి వచ్చింది. ఇంతవరకు ఇక్కడ రైతులు విక్రయిస్తున్న ధర కంటే దీని ధర అధికారులు తక్కువగా నిర్ణయించారు. బజార్‌లో ఏర్పాటు చేసిన జీసీసీ స్టాల్‌లో గురువారం నుంచి కొత్త చింతపండు విక్రయాలు ప్రారంభించారు. పిక్కతో 3 కిలోలు, 5 కిలోల చొప్పున ప్యాకెట్లుగా చేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ఇక్కడ 3 కిలోల చింతపండు ప్యాకెట్ రూ.130, 5 కిలోల చింతపండు ప్యాకెట్ రూ.210గా ధర నిర్ణయించారు. రైతులు విక్రయిస్తున్న చింత పండు కిలో రూ.72 ఉంది. దీంతో వినియోగదారులు జీసీసీ స్టాల్‌లో చింతపండు కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు ఇక్కడ రైతులు విక్రయించే ధర తగ్గే అవకాశం ఉందని వినియోగదారులు, రైతుబజార్ సిబ్బంది భావిస్తున్నారు. ఈ సందర్భంగా ఈవో ప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజయ వంట నూనె ధరలు ఇలా..

చింతపండుతో పాటు ఇక్కడ ప్రత్యేక కౌంటర్‌లో విజయ వంట నూనెలను అందుబాటులో ఉంచారు. సన్ ఫ్లవర్ నూనె లీటర్ రూ.130, పామాయిల్ లీటర్ రూ.103, వేరు శనగ నూనె లీటర్ రూ.178, రైస్ బ్రాన్ ఆయిల్ లీటర్ రూ.121 విక్రయిస్తున్నట్లు రైతుబజార్ ఈవో ప్రసాద్ తెలిపారు. ఇక్కడ నూనెలు బయట ధరల కంటే తక్కువగా ఉంటాయన్నారు.

కమ్యూనిస్టు యోధురాలు పార్వతమ్మ మృతి



పార్వతమ్మ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు



పార్వతమ్మ (ఫైల్)

అచ్యుతాపురం (అనకాపల్లి)/మద్దిలపాలెం: తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన కమ్యూనిస్టు నాయకురాలు కె.పార్వతమ్మ (89) గురువారం వృద్ధాప్య సమస్యలతో కన్నుమూశారు. సారా వ్యతిరేక ఉద్యమం, నల్లబెల్లం, ఎరువుల బ్లాక్‌మార్కెట్ వంటి ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన ఆమెకు గ్రామ స్థాయి నుంచి జాతీయస్థాయి నాయకుల వరకు విస్తృత పరిచయాలు ఉన్నాయి. పార్వతమ్మ తన ఇంటిని కేంద్రంగా చేసుకొని అనేక ఉద్యమాలు చేశారు. తిమ్మరాజుపేటలో అనేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆమె పార్థివదేహంపై సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పార్టీ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి బి.ప్రభావతి, ఎ.బాలకృష్ణ, కర్రి అప్పారావు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. శుక్రవారం నిర్వహించనున్న ఆమె అంతిమయాత్రకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు హాజరుకానున్నారు. పార్వతమ్మ మృతికి సీపీఎం జిల్లా కమిటీ నాయకులు జగ్గునాయుడు, ఆర్.కె.ఎస్.వి. కుమార్ ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం లెక్కింపు



నగదు లెక్కిస్తున్న సేవా సంఘం సభ్యులు

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల సంపత్ వినాయగర్ ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. 22 రోజులకు రూ.18.04 లక్షలు, 210 మిల్లీ గ్రాముల బంగారం, 95 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ ఫౌండర్ టి.ఆర్.బోళన్ తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారులు బి.వసంత కుమార్ పర్యవేక్షణలో నగదు లెక్కించారు. శివజ్యోతి, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, సిబ్బంది జి.గోవిందరెడ్డి, డీఎస్ ప్రసాద్, అప్పలరాజు పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్

ఘనంగా పద్య సంకీర్తనం



పద్య సంకీర్తన చేస్తున్న తెలుగు విభాగం ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో బమ్మెర పోతనామాత్యుని భాగవత ఆణిముత్యాలు పద్య సంకీర్తనం గురువారం నగరంలో ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ తెలుగు భాషా ఉత్సవాలు–2023లో భాగంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం–తెలుగు ప్రాశస్త్యం అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రథమంగా ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోతనామాత్యునిగా డాక్టర్ మూర్తి రేమెళ్ళ తాళ పత్రాలను చేతపట్టి ఘంటంతో రాస్తూ పుర వీధుల్లో నడిచిన విధానం నగర ప్రజలను ఆశ్చర్యచకితుల్నిచేసింది. ఈ విధంగా ఆయన ముందు నడవగా భాగవత ఆణిముత్యాల బృందం పద్య పఠనం చేస్తూ అనుసరించింది. ఆంధ్ర విశ్వకళాపరిషత్ ప్రధాన ద్వారం వద్ద ప్రారంభమైన పద్య సంకీర్తనం సిరిపురం ప్రధాన కూడలి మీదుగా తెలుగు విభాగం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి.యోహానుబాబు, డాక్టర్ బూసి వెంకటస్వామి, పూర్ణిమా రేమెళ్ళ, వెంకటేశ్వరరావు, డాక్టర్ జె.కె.కిషోర్, సి.వి.హెచ్.ఎస్.శర్మ, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: ఇందిరా గాంధీ ఫీడర్ నిర్వహణ పనులు చేపట్టనుండడంతో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, రవీంద్రనగర్, బి.ఎస్.ఆర్.నగర్, తోటగరువు, హనుమంతవాక ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

మద్దిలపాలెం : ఈపీడీసీఎల్ జోన్–1 పరిధిలో చైతన్యనగర్ ఫీడర్, మద్దిలపాలెం ఫీడర్ పరిధిలో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఆయా ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ మద్దిలపాలెం ఫీడర్ పరిధిలో బాల యేసు చర్చి, కేఆర్‌ఎం కాలనీ, సీఎంఆర్ శ్మశాన వాటిక ప్రాంతం, కేఆర్‌ఎం కాలనీ శివాలయం, ఎర్రాజీ కాలనీ, ఎంవీవీ బిల్డర్స్ అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే చైతన్యనగర్ ఫీడర్ పరిధిలో చైతన్యనగర్, వినాయక ఆలయ ప్రాంతం, గాయత్రి స్కూల్, దేవీ హోమ్స్, కనకమ్మ గుడి పరిసరాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని తెలిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట: సాంస్కృతిక రాజధానిగా రూపుదాల్చిన విశాఖలో దివికేగిన సినీ దిగ్గజాల స్మారకార్థం సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చెయ్యడం అభినందనీయమని గీతం విశ్వవిద్యాలయం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ అన్నారు. ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం విశాఖ పౌరగ్రంథాలయంలో కళాతపస్వి కె.విశ్వనాథ్, నేపథ్యగాయనీ వాణీ జయరామ్‌ల స్మారకార్థం సంగీత సాహిత్య సమలంకృతే శీర్షికన నిర్వహించిన సినీ సంగీత విభావరికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత ఎస్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు భాషా విలువలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు కె.విశ్వనాథ్ అని.. జాతీయ స్థాయి గుర్తింపు పొందిన వాణీ జయరామ్‌లు సినీ ప్రపంచానికి దూరం కావడం విచారకరమన్నారు. ఈ సందర్భంగా రమేష్ పట్నాయక్, శ్రీవిద్య పాడిన అందెల రవమిది, శంబర జోగారావు శైలజ పాడిన రేపల్లియ యెద ఝల్లున పొంగిన రవళి, వీకే రాజు శృతి పాడిన రాగాల పల్లకిలో, రాజేంద్రప్రసాద్, కల్యాణి పాడిన ఒక పూల బాణం పాటలు ప్రేక్షకులను అలరించాయి. పాడుతా తీయగా విన్నర్ సార్థక్, లక్ష్మీశైలజ, పి.ఎల్.నాయుడు, కోసూరు రాజు, దీప్తి పలు హిట్‌సాంగ్స్ పాడి వీనుల విందుచేశారు. ఈ కార్యక్రమంలో ఆత్రేయ స్మారక కళా పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి, పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, వైభవ్ జ్యూలర్స్ అధినేత్రి గ్రంథి మల్లిక, వ్యాపారవేత్త పువ్వాడ శోభన్ ప్రకాష్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కళా సంస్థల ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, సన్‌మూర్తి, ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎరుకమాంబ అమ్మవారికి సారె



అమ్మవారి సారెను వీధుల్లో ఊరేగిస్తున్న మహిళలు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకమాంబ అమ్మవారికి స్థానికులు తొలిసారిగా సారె పెట్టారు. స్థానిక మహిళలు అరిసెలు, చలివిడితోపాటు పలు రకాల స్వీట్లను నెత్తిన పెట్టుకుని పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి నివేదించి పసుపు కుంకుమతో పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. కార్యనిర్వాహణాధికారి రమాబాబు, అర్చకుడు శ్రీనివాసరావు పూజలు చేశారు.

స్పందించారు.. బతికించారు..



శ్రీనును బతికించిన వన్‌టౌన్ పోలీసులు

డాబాగార్డెన్స్: అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తిని పోలీసులు సకాలంలో స్పందించి కాపాడారు. ఈ ఘటన గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మంచిపల్లి శ్రీను బతుకుదెరువు కోసం కొన్నేళ్ల కిందట విశాఖపట్నం వలస వచ్చాడు. పాతనగరంలోని లక్ష్మీటాకీస్ సమీపాన వాడవీధిలో అద్దెకు ఉంటున్నాడు. అప్పులు బాధతో జీవితంపై విరక్తి చెందిన శ్రీను ఆత్మహత్యకు సిద్ధపడ్డాడు. శ్రీను సోదరుడు ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశాడు. వెంటనే వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శ్రీనుకు కౌన్సిలింగ్ ఇచ్చి గ్రామ పెద్దలకు అప్పజెప్పారు. ప్రాణాలు కాపాడిన పోలీసులకు శ్రీను కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పబ్లిక్ డిమాండ్

వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టండి



మద్దిలపాలెం: కేడీపీఎం స్కూల్ ఎదురుగా ఉన్న వీధి దీపాలు వెలగడం లేదు. డీటీఆర్–13 ఆర్‌సీ 2.54కు చెందిన వీధి దీపాలు చాలా రోజులుగా వెలగకపోవడంతో రాత్రి వేళ అంధకారం నెలకొంది. రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నాం. తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.

– రామారావు, మద్దిలపాలెం